మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట

# బైపాస్‌లో ప్రమాదాలకు చెక్

### రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

### రేడియం స్టిక్కర్లు డివైడర్ల వద్ద బోర్డుల ఏర్పాటు

### జిల్లా ఎస్పీ డి.జానకి



**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 8 ప్రభాతవార్త:** మహబూబ్‌గర్ పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్డుపై తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో జిల్లా ఎస్పీ డి.జానకి సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించి ప్రమాదాలకు గల కారణాలను గుర్తించారు. అనంతరం పోలీసు అధికారులు నేషనల్ హైవే అథారిటీ అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా రహదారిపై ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం, రాత్రి వేళల్లో వాహనదారులకు స్పష్టంగా కనిపించే విధంగా రేడియం స్టిక్కర్లు అమర్చడం, వేగ నియంత్రణ చర్యలు చేపట్టడం, డివైడర్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, ప్రమాదకర మలుపుల వద్ద ప్రత్యేక గుర్తులు ఏర్పాటు చేయడం వంటి చర్యలను వెంటనే అమలు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అతివేగం, నిరక్ష్య డ్రైవింగ్ వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొంటూ అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల ప్రాణ భద్రతే ప్రధాన లక్ష్యమని, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, నేషనల్ హైవే అథారిటీ అధికారులు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మత్స్యకార రైతులకు అవగాహన కార్యక్రమంలో, ఎమ్మెల్యే కలెక్టర్

## చేపల ఉత్పత్తిలో అగ్రగామే లక్ష్యం

### వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, మే 8, ప్రభాతవార్త:** మత్స్యకారులకు అన్ని రకాలుగా సహకారం అందించి, వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించి, చేపల ఉత్పత్తిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడమే ప్రభుత్వ లక్ష్యం అని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం నాగవరం శివారులోని రైతు వేదికలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక రైతు వారోత్సవాల్లో భాగంగా జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్యకార రైతులకు అనేక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వనపర్తి శాసనసభ్యులు మేఘారెడ్డితో పాటు, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారులకు అన్ని రకాలుగా సహకారం అందించి, వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించి, చేపల ఉత్పత్తిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడమే ప్రభుత్వ లక్ష్యం అని పేర్కొన్నారు. చేపల్లో అత్యధికంగా ప్రోటీన్ ఉండడం కారణంగా వైద్యులు చేపలు తినడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని సిఫారసు చేస్తున్నారని తెలిపారు. ఈక్రమంలో జిల్లాలో అందరికీ మంచి చేపలను అందించేలా చర్యలు చేపడతామన్నారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో మత్స్యకారులు చేపల విక్రయాలు చేసుకునేందుకు వారికి కావాల్సిన సౌకర్యాలు ఏమున్నా తమను సంప్రదించవచ్చని, అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మత్స్యకారులకు మొబైల్ వాహనాలు, సబ్సిడీ అతి తక్కువ వడ్డీ రేటుతో రుణాలు సహా అన్నిరకాలసౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి లక్ష్మప్ప, మున్సిపల్ చైర్పర్సన్ మాధవి, పెబ్బేరు మత్స్య కళాశాల అసిస్టెంట్ ప్రొ॥ దేవానంద్, సిఎస్సి ప్రతినిధి మాలిక్, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లాలోని మస్స్య కార సహకార సంఘాల నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నా రు. మత్స్యకారులు చేపల విక్రయాలు చేసుకునేందుకు వారికి కావాల్సిన సౌకర్యాలు ఏమున్నా తమను సంప్రదించవచ్చని, అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

## స్వీయ గణనను సద్వినియోగం చేసుకోవాలి

### ఈ నెల 10 వరకే అవకాశం : జిల్లా కలెక్టర్

**నారాయణపేట, మే 8 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలోని ప్రతి ఒక్కరూ స్వీయ గణన ప్రక్రియలో పాల్గొని తమ వివరాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక సూచించారు. అభివృద్ధికి మూలమైన జనగణనను సమగ్రంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం డిజిటల్ స్వీయ గణన విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. ప్రజలు తమ వ్యక్తిగత, కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక వెబ్‌సైట్‌ను అందుబాటులో ఉంచిందని, స్వీయ గణన పోర్టల్ ద్వారా లేదా మొబైల్ యాప్ సహాయంతో వివరాలు నమోదు చేసుకోవచ్చని –మిగతా4లో..



జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక



అమ్మవార్లను దర్శించుకుంటున్న మాజీ మంత్రులు

## వైభవోపేతంగా వీర నాగమ్మ పండుగ

### అమ్మవారి సన్నిధిలో మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌లు

**ఊర్కొండ, మే 08 ప్రభాతవార్త:** ఊర్కొండ మండల పరిధిలోని రాచాలపల్లి గ్రామంలో వీర నాగమ్మ దేవత పండుగను శుక్రవారం భక్తులు వైభవోపేతంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించారు. పండుగ వేడుకలకు మాజీమంత్రులు సి.లక్ష్మారెడ్డి, వి.శ్రీనివాస్ గౌడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరు కావడంతో గ్రామస్తులు వారికి ఘనస్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారిని దర్శించు కుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందిం చారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు మాట్లాడుతూ మన పూర్వీ కుల నుంచి వస్తున్న ఆచారాలను, సంప్రదాయాలను – మిగతా3లో..

# రేపటి వరకు స్వీయ గణన

- ఈ నెల 10 వరకు మాత్రమే అవకాశం
- ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోండి
- దేశ అభివృద్ధికి మూలమైన జన గణనలో పాల్గొనండి

మేయర్ జి.మమత పిలుపు




జనగణన నడకలో పాల్గొన్న మేయర్ జి.మమత

**మహబూబ్‌నగర్, మే 8, ప్రభాతవార్త:** జనగణన 2027లో భాగంగా స్వీయ గణన చేసుకునేందుకు ఈ నెల 10 వరకు మాత్రమే అవకాశం ఉందని, అందువల్ల జిల్లాలోని ప్రతి ఒక్కరు స్వీయ గణన చేసుకోవాలని మేయర్ జి.మమత పిలుపునిచ్చారు. స్వీయ జనగణనపై ప్రజల్లో అవగాహన కల్పించే నిమిత్తం శుక్రవారం ముఖ్య ప్రణాళిక అధికారి, మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్టేడియం గ్రౌండ్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించిన "జనగణన నడకను" మేయర్ స్టేడియం గ్రౌండ్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 2027 జనగణంలో భాగంగా ముందుగా స్వీయ గణన, గృహాల లెక్కింపు, జనగణన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత నెల 26 నుండి ప్రారంభమైన స్వీయ గణన ఈ నెల 10తో ముగుస్తుందని, జిల్లాలోని ప్రతి ఒక్కరు స్వీయ గణనలో పాల్గొనాలని వారి వివరాలన్నింటిని ఇవ్వాలని కోరారు. ఇంటిలో నుండే స్వీయ గణన చేసుకోవచ్చని, 16 భాషల్లో గణన చేసుకునేందుకు అవకాశం ఉందని, మొబైల్‌లోనే స్వీయ గణన చేసుకోవచ్చని, ఇది చాలా సులభమని తెలిపారు. ఈ నెల 11 నుండి ఎన్యుమరేటర్లు ఇల్లిల్లు తిరిగి హౌస్ లిస్టింగ్, ఎన్యూమరేషన్ చేస్తారని చెప్పారు. దేశ ప్రణాళిక, భవిష్యత్తు అభివృద్ధి అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసేందుకు జనగణన ఉపయోగపడుతుందని అన్నారు. జనగణన జనాభా లెక్కలకు తప్ప ఇతర దేనికి ఉపయోగించడం జరగదని, అందువల్ల ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇంట్లో ఉన్న వారందరి వివరాలను తెలియజేయాలని, కుటుంబానికి ఒక ఎన్యుమరేషన్ ఐడి వస్తుందని, దీని ఆధారంగా ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు జనగణన జాప్యం లేకుండా త్వరత్వరగా చేసుకునేందుకు వీలవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ స్వీయ గణనలో భాగస్వాములు కావాలని పునరుద్ఘాటించారు. ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్ మాట్లాడుతూ స్వీయ గణన పై ప్రజలలో అవగాహన కల్పించే నిమిత్తం" జనగణన వాక్" నిర్వహించడం జరిగిందని, అభివృద్ధికి జనాభా ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రజలు ఇంటి నుండే సెల్ ఫోన్ లో స్వీయ గణన చేసుకోవచ్చని, ఇందుకు కేవలం 10 పది నిమిషాలు కేటాయిస్తే సరిపోతుందని, స్వీయ గణనకు రెండు రోజులు మాత్రమే అవకాశం ఉన్నందున జిల్లాలోని ప్రతి ఒక్కరు స్వీయ గణన చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ రామానుజుల రెడ్డి, జిల్లా క్రీడలు యువజన సర్వీసుల అధికారి రాజ శేఖర్ రెడ్డి, కార్పొరేటర్లు, అధికారులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సీబీఐ వలలో.. పోస్టల్ ఇన్ స్పెక్టర్

### రూ.30వేలు లంచం తీసుకుంటుండగా సిబిఐకి పట్టుబడ్డ గోపీనాథ్

**వనపర్తి, మే 8, ప్రభాతవార్త :** సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగం వెలగబెడుతూ లక్షల్లో జీతాలు పొందుతూ అంతటితో సంతృప్తి చెందకుండా చేతి వాటం ప్రదర్శించిన వనపర్తి పోస్టల్ సబ్ ఇన్ స్పెక్టర్ గోపీనాథ్ ను సీబీఐ అధికారులు పట్టుకున్న ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. క్రింది స్థాయి ఉద్యోగులు అదనంగా చేసే విధులకు రావాల్సిన అదనపు డబ్బులు గత మూడు సంవత్సరాలుగా నిలిచిపోయాయి. ఇటీవల ఉన్నతాధికారులు అదనంగా విధులు నిర్వహించిన ఉద్యోగులకు చెల్లించేందుకు వీలుగా నిధులు మంజూరి చేశారు. ఆ డబ్బులను ఎటువంటి ఆక్షేపణలు లేకుండా చిరు ఉద్యోగులకు చెల్లించవలసిన పోస్టల్ సబ్ ఇన్స్పెక్టర్, సూపరింటెండెంట్ డబ్బులు మంజూరు చేయాలి అంటే తమకు 30 శాతం డబ్బులు ఇవ్వాలి అని .. అలా అయితేనే డబ్బులు మీ ఖాతాలలో జమ అవుతాయని తేల్చి చెప్పారు. "దాదాపుగా 40 మంది ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తూ వచ్చారు. తప్పని పరిస్థితిలో చిరు ఉద్యోగులు సంబంధిత సీబీఐ, పోస్టల్ డిపార్ట్మెంట్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వనపర్తి పోస్టల్ ఇన్ స్పెక్టర్ గోపీనాథ్ ఒక ఉద్యోగి నుంచి రూ.30వేలు లంచం తీసుకుంటుండగా గురువారం సాయంత్రం దాదాపుగా 12 మంది సీబీఐ అధికారులు పట్టుకునే ప్రయత్నం చేశారు. ఈ పరిణామాలను పసి గట్టిన పోస్టల్ ఇన్ స్పెక్టర్ గోపినాథ్ తాను తీసుకున్న డబ్బులను ట్రెజరర్ కు ఇచ్చి ఇవి లెక్కపెట్టమని చెప్పి కార్యాలయం గోడ దూకి ఆటోలో పరారయ్యాడు. ఫోన్ సిగ్నల్స్ ద్వారా గోపీనాథ్ కొత్తకోట మదనాపూర్ రోడ్డు వద్ద దూర ప్రాంతాలకు వెళ్లడానికి నిలిచి ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. తిరిగి వనపర్తి పోస్టల్ కార్యాలయానికి తీసుకు వచ్చారు. రాత్రి మొత్తం విచారణ జరిపి శుక్రవారం ఉదయం రిమాండ్‌కు తరలించారు. పోస్టల్ సూపరింటెండెంట్ పరారీలో ఉన్నట్లు గుర్తించారు. పట్టుబడిన పోస్టల్ ఇన్ స్పెక్టర్ గోపీనాథ్ కు బినామీ పేర్ల మీద పెద్ద ఎత్తున ఆస్తులు ఉన్నట్లు గుర్తించినట్లు తెలుస్తోంది. మొత్తం పై పోస్టల్ డిపార్ట్ మెంట్ లో జరిగిన వ్యవహారం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.




వనపర్తి పోస్టల్ కార్యాలయం

## క్రషర్‌లో భారీ పేలుళ్లు.. ఇళ్లకు పగుళ్లు

### పేలుళ్ల శబ్దాలకు వణికి పోతున్న ప్రజలు

**బాలానగర్, మే 8 ప్రభాతవార్త :** బాలానగర్ మండల కేంద్రం శివారులో గురువారం రాత్రి 8 గంటల సమయంలో క్రషర్ లో జరిగిన భారీ పేలుడు శబ్దంతో మండల కేంద్రం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. భూకంపం వచ్చినట్టుగా భారీ శబ్దాలు వినిపించ దంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. బ్లాస్టింగ్ తీవ్రతకు కొన్ని ఇండ్లు కంపించినట్లు స్థానికులు తెలిపారు. ఇప్పటికే పలు చోట్ల ఇండ్ల గోడలకు పగుళ్లు వచ్చాయని రోజురోజుకూ పరిస్థితి ఆందోళనకరంగా మారుతోందని వాపోయారు. గౌతపూర్, అమ్మపల్లి, బాలానగర్ గ్రామాలకు సమీపంలో ఈ క్రషర్లు ఉండడం వలన శబ్ద కాలుష్యంతో పాటు వాయు కాలుష్యం – మిగతా4లో..



పేలుళ్లతో ఇళ్లకు పగుళ్లు వచ్చిన దృశ్యం

## తరుగు పేరిట రైతుల నిలువు దోపిడి

### ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు.. ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు..

**ఆత్మకూర్ మే 8, ప్రభాతవార్త :** ప్రస్తుత రబీ సీజన్ కు సంబంధించి ఎలాంటి తరుగు లేకుండానే ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేయడం జరుగుతుందని ప్రభుత్వ అధికారులు స్పష్టంగా ప్రకటిస్తున్నప్పటికీ ఆత్మకూరుమండల కేంద్రంలో మాత్రం ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ రైస్ మిల్లర్లు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ప్రజా పాలనలో రైతులకు ఎలాంటి నష్టం జరగనివ్వమంటూ ఓవైపు రాష్ట్ర ముఖ్యమంత్రి సాక్షాత్తు ప్రకటిస్తున్నప్పటికీ ఆత్మకూరు మండలంలోని రైతులకు మాత్రం నిరాశే ఎదురవుతుంది. ఆత్మకూర్ సబ్ డివిజన్ పరిధిలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు మరియు రామన్పాదు బ్యాలెన్స్ రిజర్వాయర్ ఆయకట్టు రైతులకు ఆత్మకూరు మరియు మండలంలోని వివిధ గ్రామాలలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ కొనుగోలు మాత్రం అంతంత మాత్రంగానే కొనసాగుతుంది. మండల కేంద్రమైన ఆత్మకూర్ పట్టణంలోని నాలుగు రైస్ మిల్లుల యజమానులకు ప్రభుత్వం దాన్యం నిలువ చేసేందుకు కొనుగోలు చేసిన ఒడ్లను అనుమతి ఇవ్వడంతో పట్టణంలోని బాలాజీ రైస్ మిల్, సాయిరాం రైస్ మిల్. యజమానులు రైతుల నుండి తరుగు పేరిట ప్రతి క్వింటాలకు 10 కిలోల చొప్పున కటింగ్ చేస్తున్నాడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం రోజు ప్రభాతవార్త క్షేత్ర స్థాయిలోపరిశీలనకు వెళ్లగా సాయిరాం రైస్ మిల్లు యజమాని మూలమల్ల మరియు గుంటుపల్లి గ్రామాలకు చెందిన రైతులు వడ్లను కొనుగోలు చేసిన విషయంపై చర్చించేందుకు రావడంతో ప్రతి బస్తాకు నాలుగు కిలోల మేర తరుగు తీస్తామని లేని పక్షంలో తాము కొనుగోలు చేయబోమని తేల్చి చెప్పడంతో రైతులు తీవ్ర మనోవేదనకు ఒకరి కావడం విశేషం. ఓవైపు ఎలాంటి తరుగు లేకుండానే కొనుగోలు చేయాలని గత మంగళవారం వనపర్తి జిల్లా కలెక్టర్ ఆత్మకూరు మార్కెట్ యార్డెన్ సందర్శించి రైస్ బిల్లుల యజమానులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ అవేమీ పట్టించుకోకుండా తాము తరుగు తీయకుండా కొనుగోలు చేయలేమని చెబుతుండడంతో రైతుల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి లాగా మారిందని తీవ్ర ఆవేదన – మిగతా4లో..

## ఎట్టకేలకు వృద్ధుల నిరీక్షణకు తెర..

### వార్తా కథనాల ప్రభావం

### కదిలిన అధికారులు

### ప్రారంభమైన పింఛన్ పంపిణీ

### పత్రిక ప్రచురణలతో సమస్యకు పరిష్కారం

వార్త ఎఫెక్ట్



వృద్ధులకు పింఛన్ అందజేస్తున్న అధికారులు

**ధన్వాడ, మే 8 ప్రభాతవార్త :** ధన్వాడ మండల కేంద్రంలో ఏప్రిల్ నెలకు సంబంధించిన పింఛన్ పంపిణీ తీవ్ర ఆలస్యానికి గురైన విషయం తెలిసిందే. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ బ్యాంకుల్లో డబ్బుల కొరత కారణంగా లబ్ధిదారులు రోజులు తరబడి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పింఛన్ కోసం ప్రతిరోజూ పోస్ట్ ఆఫీస్ చుట్టూ తిరుగుతూ గంటల కొద్దీ ఎదురు చూసిన వృద్ధులు, వికలాంగులు, వితంతువులు చివరకు ఆందోళనకు దిగారు. ఈ సమస్యను వార్తాపత్రిక వరుస కథనాల ద్వారా ప్రజల – మిగతా4లో..

## ప్రతి చివరి ధాన్యపు గింజ వరకు కొంటాం

### వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు

### సమస్య లేకుండా చూడాలి

### నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు

### తప్పవు : ఎమ్మెల్యే మెఘారెడ్డి

**పెద్దమందడి, మే 8 ప్రభాతవార్త :** ఆరుగాలం శ్రమించి పండించిన పంటను చివరి ధాన్యపు గింజ వరకు ఉంటామని రైతులు ఎక్కడ అధైర్య పడాల్సిన అవసరం లేదని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పెద్దమందడి మండలం వీరేపల్లి గ్రామంలో ఎస్పిఓ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సమైక్య పిఎసిఎస్ మెప్మాలతో పాటు హెప్ పిఓలను సైతం ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో విరేపల్లిలో వారి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని ఎక్కడ ఎలాంటి సమస్యలు లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కార చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కొనుగోలు నిరంతరాయంగా కొనసాగుతున్నందువలన అక్కడక్కడ లారీలు కాని, బస్తాల సమస్య ఉన్న అధికారులు వెంటనే పరిష్కరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అధికారులు ఎవరైనా నిరక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అన్నదాతలు ఎలాంటి ఆందోళనలకు గురికాకూడదని మీరు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ప్రతి ప్రతి ధాన్యపు గింజలు కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు రాజప్రకాశ్‌రెడ్డి, వనపర్తి మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, డైరెక్టర్లు వెంకటయ్య, వెంకటరామిరెడ్డి, బాల్రెడ్డి, లక్ష్మణ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సత్యారెడ్డి, మాజీ జడ్పిటిసి వెంకటస్వామి, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే మెగా రెడ్డి

## ముదిరాజ్ సమస్యలను పరిష్కరించాలి

### బీసీ ఏ కేటగిరిలోకి మార్చండి

### మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో సీఎం రేవంత్ రెడ్డికి, డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ విజ్ఞప్తి



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి, డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్

## పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : డాక్టర్ స్వరూపరాణి

**వడ్డేపల్లి,మే8 ప్రభాతవార్త :** పశువైద్య పశు సంవర్ధక శాఖ టీజీఎల్ డిఏ బుడమర్సు లో శుక్రవారం పశు వైద్య శిబిరంనిర్వహించడం జరిగింది.16మంది రైతులకు చెందిన 37 గేదెలు 6 ఆవులకు గర్భ కోశ పరీక్షలు నిర్వహించడం జరిగింది. 18 గేదెలు1 ఆవు కట్టినవి. 17 గేదెలు1 ఆవు కట్ట లేదు మిగిలిన వాటికి తగిన చికిత్సలు మందులు ఉచితంగా ఇచ్చారు.23ఆవులు గేదెలకు సాధారణ చికిత్సలు చేశారు.53దూడలతో గ్రామంలో ప్రదర్శన చేశారు.30 కేజీల గడ్డి విత్తనాలు రైతులకు ఇచ్చారు.వేసవిలో పశు సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించి రైతులకు అవగాహన కల్పించారు.170మేకలకు నట్టలు నివారణ మందులు తాగించారు. 150 కోళ్లకు రోగాలు బట్టి మందులు ఇచ్చి చికిత్సలు చేశారు.శిబిరంను సర్పంచ్ గోవిందమ్మ ప్రారంభించారు. మండల పశువైద్యురాలు డా. స్వరూపరాణి, మండల వ్యవసాయ అధికారి రాధ. ఎల్ఎస్ఏలు లతీఫ్ శాంతి, ఏఈఓ వినోద్, సిబ్బంది రవి, కృష్ణ, గోపాలమిత్రులు సాగర్, లక్ష్మన్న పాల్గొన్నారు.


శిబిరంలో పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

## కిశోర్ బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

**నవాబుపేట, మే 8 ప్రభాతవార్త :** కిశోర బాలికలు రక్తహీనత లేకుండా పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీడీవో జయరాం నాయక్ సర్పంచ్ రవీందర్ అన్నారు. శుక్రవారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ పోషణ మాసంలో 99 ప్రజా పాలనలో భాగంగా రుద్రారం గ్రామంలో నిర్వహించిన కిశోర బాలికలకు పౌష్టికాహార అవగాహనలో విద్యార్థులకు రక్తహీనత పరీక్ష నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మండల అధికారులు గ్రామ సర్పంచ్ రవీందర్ ఎంపీడీవో జయరాంనాయక్,ఎంపీ బద్రునాయక్,ఏపీవో జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థినులు, కిశోర బాలికలు పాల్గొని రక్తహీనతపై విద్యార్థినిలకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవీందర్ మాట్లాడుతూ రక్తహీనతను తగ్గించేందుకు ప్రభుత్వం తగిన తీసుకుంటుందన్నారు. సరైన సమయంలో కిషోర బాలికలు రక్తహీనత లేకుండా పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని, సకాలంలో వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. పరీక్షలు ఎప్పటికప్పుడు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, కిశోర బాలికలు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

## బాధ్యతలు చేపట్టిన సింగిల్ విండో పాలకమండలి

**పెద్దమందడి, మే 8 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా పెద్దమందడి వ్యవసాయ సింగిల్ విండో పాలకమండలిని ప్రభుత్వం రద్దుచేయగా వారు నిర్ణయం పై హైకోర్టు తీర్పు వెలువడింది. అనంతరం తిరిగి పదవి బాధ్యతలు స్వీకరించిన పాలకమండలి సభ్యులు సమావేశం నిర్వహించి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సింగిల్ విండో అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం పాలకమండలి కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. సహకార సంఘాల పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అభినందిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యక్షులు డైరెక్టర్లు మాట్లాడుతూ తిరిగి బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు సమిష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణ తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సమావేశంలో సింగిల్ విండో అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్, పాలకమండలి సభ్యులు నరేష్, రామ్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, సుందరమ్మ, వెంకటయ్య, మన్నెంకొండ సీఈవో సుధాకర్, సహకార సంఘం సిబ్బంది పాల్గొన్నారు.


తిరిగి బాధ్యతలను చేపట్టిన పెద్దమందడి పాలకమండలి

## పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స

**కెటిదొడ్డి మే 08, ప్రభాతవార్త;** మండల పరిధిలోని కుచినేర్ల గ్రామంలో "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల "కార్యచరణ ప్రణాళిక భాగంగా శుక్రవారం పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో ఉన్నటువంటి మేలు జాతి దూడల ప్రదర్శన , పాడి పశువుల , మినరల్ మిక్చర్ దూడల కు నట్టల నివారణ మందులు ఎదకు రాని పశువులకు ఎదకు వచ్చేటట్టు టాబ్లెట్లు ఇవ్వడం జరిగింది.ఎదకు వచ్చిన పశువులకు కృత్రిమ గర్భాదారణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ కె. కృష్ణ మాట్లాడుతూ... పాడిపశువులు పెంచుకోవడం వల్ల రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు. పాలు, పాలు ఉత్పత్తుల ద్వారా గ్రామీణ కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని తెలిపారు.అదేవిధంగా కృత్రిమ గర్భాధారణ ద్వారా జన్మించిన దూడలు మంచి జాతికి చెందినవిగా ఉండి, అధిక పాలు ఇచ్చే సామర్థ్యం కలిగి ఉంటాయని వివరించారు. రైతులు ఆధునిక పద్ధతులను అవలంబించి పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య అధికారులు డాక్టర్ వినయ్ కుమార్. అర్జున్ సింగ్ విఏ ఆఫీస్ సబార్నేటర్, మోహన్ బాబు ,భీమయ్య , గోపాలమిత్ర సూపర్వేజర్ రవికుమార్. గోపాలమిత్రు గోపాల్ రెడ్డి, ఉపసర్పంచ్,వార్డు సభ్యులు, గ్రామ పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ కనబరిసిన విద్యార్థులకు సన్మానం

**అచ్చంపేట, మే 8 ప్రభాతవార్త:** ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులను శాలువాలతో ఘనంగా సన్మానించడం జరిగిందని చేతుల బావి తండ సర్పంచి మూడవ పార్వతి బాలు నాయక్ తెలిపారు. శుక్రవారం అచ్చంపేట మండలం చేతుల బావి తండా గ్రామంలో 2026 సంవత్సరంలో పదవ తరగతి ఇంటర్మీడియట్ లో ప్రతిభ కనబరిచిన గ్రామ విద్యార్థిని, విద్యార్థులను గ్రామ ప్రజల సమక్షంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారిలో ఒక చైతన్యం ఏర్పడుతుందని ఆత్మవిశ్వాసం కూడగట్టుకునే విధంగా విద్యార్థుల మనసు ఆలోచన మారుతుందనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థులలో మరింత ఆత్మవిశ్వాసంతో ఉన్నత చదువులు చదువుకోవాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మున్య నాయక్,గ్రామ ప్రజలు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

## ప్రజాపాలనతో ప్రజలకు ప్రభుత్వ పథకాలు: డీఎఫ్ఓ

**నారాయణపేట, మే 8 ప్రభాతవార్త :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేస్తున్నామని డీఎఫ్ఓ రహ్మాన్ తెలిపారు.పేటలోని సింగారం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలపై ప్రజలకు పూర్తిఅవగాహన కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈకార్యక్రమానికి రిటైర్డ్‌డీడీఎఫ్ జిల్లాఅధ్యక్షులు,జిల్లాఉద్యానవనాధికారి,జిల్లా వ్యవసాయ అధికారి,ఇతరప్రజాప్రతినిధులు,ఎఫ్‌సీఎస్‌సభ్యులు అతిథులుగా హాజరయ్యారు.అలాగే కార్యక్రమంలో డిప్యూటీడైరెక్టర్ ఆఫ్‌ఫిషరీస్ డి.వేణుగోపాల్,జిల్లాహార్టికల్చర్ ఆఫీసర్ సాయిబాబా, వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, డీఎఫ్‌సీఎస్ చైర్మన్ కాంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా పాఠశాలలకు ఎంపికైన విద్యార్థినులు

**దామరగిద్ద, మే 8 ప్రభాతవార్త:** తెలంగాణ క్రీడా పాఠశాలలకు దామరగిద్ద మండలం నుండి ఇద్దరు విద్యార్థినులు ఎంపిక కావడం మండలానికి గర్వకారణమైంది. క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి క్రీడా పాఠశాలల్లో ప్రవేశం పొందిన ఈ విద్యార్థినులను గ్రామ ప్రజలు అభినందించారు. ఎంపికైన విద్యార్థినుల్లో బండి నిహారిక (తండ్రి: బండి విజయకుమార్) ఎంపీపీఎస్ సజనాపూర్ పాఠశాలకు చెందిన విద్యార్థిని కాగా, ఈ. కావేరి (తండ్రి: వెంకటేష్) జీపీఎస్ దామరగిద్ద పాఠశాలకు చెందిన విద్యార్థిని.ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థినులను ఎంఈఓ కృష్ణారెడ్డి, గ్రామ సర్పంచులు అద్దన్ కనికి రెడ్డి, అనంతమ్మ, ప్రధానోపాధ్యాయులు గీత, లక్ష్మణ్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకుని మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.




# సమీకృత మార్కెట్ సముదాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### త్వరలోనే గోల్డ్ బజార్ : స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి

**వనపర్తి ప్రతినిధి,మే 8, ప్రభాతవార్త:** వనపర్తి పట్టణంలోని పాత మార్కెట్ యార్డు ప్రాంతంలో నూతనంగా అత్యాధునిక సదుపాయాలతో నిర్మించిన సమీకృత మార్కెట్ సముదాయంలోని మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన రిజిస్ట్రేషన్ అస్యూరెన్స్ కార్యాలయాన్ని శుక్రవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కొత్తకాపు శివసేనారెడ్డి,జిల్లా కలెక్టర్ ఆదర్శసురభి,మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవితో కలిసి ప్రారంభోత్సవం చేశారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ సమీకృత మార్కెట్ సముదాయం పూర్తి అయి దాదాపు సంవత్సరం పైగా అవుతున్నప్పటికీ షాపుల అద్దె ఎక్కువగా ఉండటంతో షాపులు తీసుకోడానికి వ్యాపారస్తులు ఎవరు ముందుకు రాలేదన్నారు. పరిస్థితిని గమనించి జిల్లా కలెక్టర్‌తో సమన్వయం చేసుకొని నిర్ణయించిన రేట్లలో సగానికి తగ్గించి ప్రతిపాదనలు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావును పంపించగా అట్టి ప్రతిపాదనలు ఆమోదించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.సమీకృత మార్కెట్‌లో షాపులు పొంది ప్రార్భోత్సవాలు చేసుకున్న రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది, దస్తావేజు లేఖరులకు శుభాకాంక్షలు తెలిపారు.సమీకృత మార్కెట్ సముదాయంలో ఇంకా డిమాండు ఉందని, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి అవసరమైన వారందరికీ షాపులు కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమీపంలో ఉన్న టౌన్ హాల్‌ను సైతం వినియోగంలోకి తీసుకువస్తామని అదేవిధంగా దాని చుట్టూ ఉన్న ఖాళీ స్థలంలో బంగారు షాపులను నిర్మించి ఇక్కడే గోల్డ్ బజార్ ఏర్పాటుకి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు.ప్రస్తుతం కొన్ని వసతిగృహాలు అద్దె భవనాల్లో ఉన్నా యని, త్వరలోనే ప్రభుత్వ భవనాల్లోకి మార్చేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.దాదాపు ఒకటిన్నర సంవత్సరాల నుండి నిరుపయోగంగా పడిఉన్న సమీకృత మార్కెట్ సముదాయాన్ని ప్రత్యేక చొరవ తీసుకోవడం వల్ల షాపు ధరలు తగ్గించి లాటరీ పద్ధతి ద్వారా పారదర్శకంగా షాపుల కేటాయింపు చేయడం జరిగిందన్నారు.గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న షాపులకు డిమాండు ఉంటుందనీ కానీ పైఅంతస్తులో తీసుకోడానికి ఎవరు ఇష్టపడరన్నారు. అందుకే పైఅంతస్తులో రిజిస్ట్రేషన్‌శాఖ పెట్టడంవల్ల అన్నిషాపులకు డిమాండు పెరిగిందన్నారు. గత పాలకులు అసంపూర్తిగా వదిలిన భవనానికి దాదాపు రూ.23లక్షలు అదనంగా ఖర్చు చేసి ట్రాన్స్‌ఫార్మర్ సైతం ఏర్పాటుచేసి వినియోగంలో తెచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాధవి,జిల్లా రిజిస్ట్రార్ ఫణీంద్ర, సబ్ రిజిస్ట్రార్ చంద్రశేఖర్,కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.


రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, డిసిసి చైర్మన్, కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

# లక్ష్మీపల్లి గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల పర్యటన

**దేవరకద్ర, మే 8 ప్రభాతవార్త:** తెలంగాణ రైతు శాస్త్రవేత్తలు శశి భూషణ్, అసిస్టెంట్ ప్రొ॥ చరణ్ తేజ్ రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమాన్ని దేవరకద్ర మండలం, లక్ష్మీ పల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పంట మార్పిడి చేయాలని మార్కెట్లో గిరాకీ ఉన్న వరి రకాలు అయిన సన్న రకాలైన ఆర్ఎన్ఆర్15048, హెచ్ఎంటి 1638 వంటి రకాలను వేసుకోవాలని అలాగే దొడ్డు గింజ రకాలైన ఎంటియు 1010, కేఎన్ఎమ్ 118 వంటి రకాలను వేసుకోవాలని చెప్పారు. ప్రతి పంటలో రైతులు పాటించాల్సిన మెలకువలు, పెట్టుబడి తగ్గించి అధిక దిగుబడి పొందే అంశాల గురించి చెప్పారు. సేంద్రియ వ్యవసాయం జీవన ఎరువుల వాడకం మరియు చౌడు భూములు యాజమాన్య గురించి అలాగే రసాయన మందులు పిచికారి చేసుకొనుట, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పంటలలో చీడపీడల నివారణ ఎరువుల సమతుల్య వినియోగం వాతావరణాల వ్యవసాయ పద్ధతులపై రైతులకు సూచనలు చేశారు. రైతుల అడిగిన పలు సందేహాలకు శాస్త్రీయ సమాధానాలు ఇచ్చి ఆధునిక సాగు విధానాలను వివరించారు. ఏఈఓ మాట్లాడుతూ రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తే ,దిగుబడులు పెరిగి ఆర్థికంగా లాభ పడతారని తెలిపారు. అనంతరం గ్రామ సర్పంచ్ లక్ష్మీ ఆంజనేయులు మాట్లాడుతూ భూసార పరీక్షలు కచ్చితంగా తీసుకోవాలని ,కాంప్లాక్స్ ఎరువులు ఎక్కువ వాడొద్దని, ఎరువుల వాడకాన్ని అవసరానికి మరి మించి వాడొద్దని, ఇలాంటి అవగాహన సదస్సులు ఎక్కువ మొత్తంలో గ్రామంలో చేసి ప్రతి ఒక రైతు పంట మార్పిడి కచ్చితంగా పాటించి సుస్థిర ఆదాయాన్ని పొందాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మీ ఆంజనేయులు వ్యవసాయ విస్తరణ అధికారీ, సేంద్రియ రైతులు, ఏఈఓ, ఉపసర్పంచ్, 70 మంది రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

## సమస్యల పరిష్కారానికి సహకరిస్తా


ఎమ్మెల్యే జిఎంఆర్‌ను కలిసిన సర్పంచ్, గ్రామస్తులు

**దేవరకద్ర,మే8 ప్రభాతవార్త:** దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిని గోపన్ పల్లి సర్పంచ్ బాలరాజ్, గ్రామస్తులు,మర్యాదపూర్వకంగా కలిసి, పలు స్థానిక సమస్యలు, గ్రామాభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల గురించి ఎమ్మెల్యేకు వివరించారు. సమస్యల పరిష్కారానికి సహకరిస్తానని దేవరకద్ర ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు సర్పంచ్ బాల్‌రాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపన్‌పల్లి గ్రామ అధ్యక్షులు రాంబాబు, కుమ్మరి బుచ్చన్న, గోపన్ పల్లి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత సమ్మర్ కోర్సులు

**నారాయణపేట, మే 8 ప్రభాతవార్త :** నారాయణపేట మండలం కొలంపల్లిలోని మదర్సా దారుల్ ఉలూమ్ అష్రఫియాలో అష్రఫియా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అష్రఫియా కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌ను భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డా. రాజ్‌కుమార్ రెడ్డి ప్రారంభించారు ఈ సందర్భంగా ఉచిత సమ్మర్ కంప్యూటర్ కోర్సు తరగతులను సయ్యద్ జలాల్ హుస్సైనీ అష్రఫీ సజ్జాదా నషీన్ బార్గాహ్ ఖతాలియా కొలంపల్లి మరియు డాక్టర్ రాజ్‌కుమార్ రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొలంపల్లి సర్పంచ్ ఎం. బాలూ, ఉపసర్పంచ్ బజరంగ్ పాల్గొన్నారు. అష్రఫియా ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి హాజీ మహమ్మద్ షఫీ చాంద్ మాట్లాడుతూ వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని కంప్యూటర్ విద్యను అభ్యసించాలని సూచించారు. ఉచిత కంప్యూటర్ కోర్సులు మే 09 శనివారం నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. ఆరో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుతున్న విద్యార్థులు ఈ కోర్సులో చేరవచ్చని పేర్కొన్నారు. కోర్సులో ప్రవేశం పొందదలచిన విద్యార్థులు మదర్సా దారుల్ ఉలూమ్ అష్రఫియా కొలంపల్లిలో దరఖాస్తు ఫారమ్ నింపి సమర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా భీష్మరాజ్ ఫౌండేషన్ తరఫున అష్రఫియా ఎడ్యుకేషనల్ సొసైటీ కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్ అభివృద్ధి కోసం రూ.85 వేల చెక్కును డా. రాజ్‌కుమార్ రెడ్డి అందజేశారు.కార్యక్రమంలో సయ్యద్ అహ్మద్ హుస్సైనీ అష్రఫీ, మహమ్మద్ తాజుద్దీన్, ఫజల్ అహ్మద్, సయ్యద్ దస్తగీర్ హుస్సైనీ, హాఫిజ్ జలాల్‌తో పాటు భీష్మరాజ్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



సమ్మర్ ఉచిత కంప్యూటర్ కోర్సులు ప్రారంభిస్తున్న భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డా. రాజ్‌కుమార్ రెడ్డి

## సరస్వతీ ఆలయంలో ప్రత్యేక పూజలు


సరస్వతీ పూజలో పాల్గొన్న మహిళలు

**అచ్చంపేట,మే,8ప్రభాతవార్త:**అచ్చంపేట పట్టణం సీతారాళ్ళగుట్టలో జ్ఞానసరస్వతి దేవి ఆలయంలో శ్రీ భక్త మార్కండేయ శివాలయం ఉపాలయాల్లో మండల పూజ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం గణపతి పూజ,పుణ్యాహవచనం,మంటప ఆరాధన నిర్వహించారు. సరస్వతి దేవికి, గణపతికి, లలిత త్రిపుర సుందరి దేవికి, శివునికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అర్చకులచే విశేష హోమం నిర్వహించారు.పద్మశాలి మహిళసంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.సరస్వతి మాత ఆలయానికి సహకరించిన దాతలను సన్మానించారు.ఈకార్యక్రమంలో దాసపత్రిశకుంతల,వనం పర్వతాలు,వనం గీత, చిలువేరు ధనరాజ్, కర్నాటి రాములు, దాసు శ్రీనివాసులు,గుర్రంహైమావతి,కోట ప్రశాంతి, ఇమ్మడి రాజేశ్వరి, వనం వేణు, కర్నాటి నారాయణ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వమే హమాలీ ఖర్చులు భరించాలి

### రైతులను దోపిడీ చేస్తున్న రైస్ మిల్లుల యజమానులు

### మే 11 సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలి

**దామరగిద్ద, మే 8, ప్రభాతవార్త:** దామరగిద్ద మండల పరిధిలోని చాకలివానిపల్లి, ఆశన్‌పల్లి వరి కొనుగోలు కేంద్రాలను సీపీఎం బృందం సందర్శించింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు గోపాల్, అంజిలయ్య గౌడ్ మాట్లాడుతూ రైస్ మిల్లుల యజమానులు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులపై ఒత్తిడి తెచ్చి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తూకాలు వేయిస్తూ రైతులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బస్తాకు 40 కిలోల 600 గ్రాములు సంచి తూకంతో కలిపి తూకం వేయాల్సి ఉండగా, మిల్లర్లు తాలు, తేమ శాతం పేరుతో అదనపు తరుగు విధించి ఒక్కో బస్తాకు 42 కిలోల వరకు తూకం వేస్తున్నారని తెలిపారు.కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు మిల్లర్ల కనుసన్నల్లో పనిచేస్తున్నారని విమర్శించారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా రైతులు అరుగాలం కష్టపడి పండించిన ధాన్యంలో ప్రతి క్వింటాల్‌కు 3 నుంచి 4 కిలోల వరకు అదనంగా కోత విధిస్తున్నారని అన్నారు. అలాగే హమాలీ పేరుతో ప్రతి క్వింటాల్ ధాన్యానికి రూ.40 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ హమాలీ చార్జీలను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. కొన్ని కొనుగోలు కేంద్రాల వద్ద కనీస వసతులు కూడా లేవని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లర్ల దోపిడీని అరికట్టాలని, ఇప్పటికే అదనంగా తూకం వేసి రైతుల నుంచి తీసుకున్న ధాన్యానికి సంబంధించిన మొత్తాన్ని రైతులకు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం మే 11 సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాలో జిల్లాలోని రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అరుణ్, హన్మంతు, విజయబాబు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన సిపిఎం జిల్లా నాయకులు

## పశు వైద్య శిబిరం విజయవంతం

**పెద్దమందడి,మే 8 ప్రభాతవార్త :** పెద్దమందడి మండల కేంద్రంలో శుక్రవారం పశువైద్యశాల ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పశు ఆరోగ్యశిబిరం విజయవంతం అయినట్లు డా. సామ్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ గంగమ్మ రవి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, దూడలకు నట్టల నివారణ మందులు తాగించడం జరిగింది. రైతులకు పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేయడం వేసవిలో పశువులకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఉషన్న, పాడి రైతులు, పశువైద్య సిబ్బంది వెంకటేష్ ,రాజేష్, గోశాల మిత్రులు రాఘవేందర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రజా పరిపాలన కార్యక్రమం


పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

**నారాయణ పేట, మే 8 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా ఉట్కూర్ గ్రామ ప్రజా పరిపాలన కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులపై ఆధారపడి జీవిస్తున్న ప్రజలకు పశుగ్రాస నిర్వహణ, తాగునీటి సదుపాయం, సంతానోత్పత్తి, పశువుల సంరక్షణ, అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. పశువుల ఆరోగ్య పరిరక్షణతో పాటు ఆధునిక పద్ధతుల ద్వారా అధిక లాభాలు పొందే విధానాలను వివరించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి సాయి వరుణ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విఘ్నేశ్వర్ రెడ్డి, ఉప సర్పంచ్ రమేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు భరత్, బాల ఆంజనేయులు రఘు తదితరులు పాల్గొన్నారు.

# పీఎం శ్రీ పాఠశాలల్లో 15 రోజుల సమ్మర్ క్యాంపులు

**నారాయణపేట, మే 8 ప్రభాతవార్త :** విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు,వ్యక్తిత్వ వికాసం,కళానైపుణ్యాలు,క్రీడా స్ఫూర్తి, శాస్త్రీయ దృక్పథం సామాజిక అవగాహన పెంపొందించే లక్ష్యంతో జిల్లాలోని 17 పీఎం శ్రీపాఠశాలల్లో 15రోజులపాటు ప్రత్యేక సమ్మర్ క్యాంపులు నిర్వహించనున్నట్లు జిల్లావిద్యాశాఖ అధికారి ఎక్స్ఆఫిషియో జిల్లాప్రాజెక్ట్ ఆఫీసర్, సమగ్ర శిక్ష, శ్రీ గోవిందరాజు తెలిపారు. మే11 నుండి మే25 వరకు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ సమ్మర్ క్యాంపులు నిర్వహించబడనున్నాయని తెలిపారు. జిల్లాలో ఎంపిక చేసిన పీఎం శ్రీ పాఠశాలలతో పాటు సమీపంలోని ఇతర ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూడా పాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వేసవి సెలవులను సార్థకంగా వినియోగించుకునేలా విద్యార్థులకు ఆటపాటలతో కూడిన అభ్యాసం, ఆనందభరితమైన నేర్చుకోవడం, అనుభవాత్మక విద్య,జీవననైపుణ్యాల పెంపు, సృజనాత్మక కార్యకలాపాలు ప్రధాన లక్ష్యంగా ఈక్యాంపులను రూపకల్పన చేసినట్లు తెలిపారు క్యాంపుల్లో సంగీతం,శాస్త్రీయ నృత్యం, జానపద కళలు, చిత్రలేఖనం, కథా రచన, కథా వినిపింపు కార్యక్రమాలు, కుట్టు, అల్లిక, చేతిపనులు వంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అదేవిధంగా వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాల పెంపు, చెస్, ఇండోర్ గేమ్స్, క్రీడా పోటీలు, యోగా, ఫిట్‌నెస్ కార్యక్రమాలు కూడా ఉంటాయని, గణిత నమూనాలు, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తయారీ, సాధారణ సైన్స్ ప్రయోగాలు, క్విజ్ పోటీలు,మాక్‌పార్లమెంట్,చర్చా వేదికలు, భారతీయ భాషా ఉత్సవ్ కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన అల్పాహారం, తాగునీరు, పరిశుభ్రమైన వాతావరణం,సురక్షిత పర్యవేక్షణతో అన్నిఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. పీఎం శ్రీపాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు క్యాంప్ ఇంచార్జ్‌గా వ్యవహరిస్తూ క్యాంపు నిర్వహణ, విద్యార్థుల హాజరు, భద్రత, కార్యక్రమాలను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.ఈ క్యాంపులు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతోపాటు భవిష్యత్ విద్యాభ్యాసానికి దృఢమైన పునాది వేస్తాయని డీఈఓ శ్రీ గోవిందరాజు తెలిపారు. జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధిక సంఖ్యలో పాల్గొనాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలని కోరారు వేసవి సెలవులు కేవలం విశ్రాంతికే కాదు.. విజ్ఞానానికి, వినోదానికి, వ్యక్తిత్వ వికాసానికి వేదిక కావాలి" అని ఆయన పేర్కొన్నారు.

# సమగ్ర పశుసంవర్ధక సేవా శిబిరాలు రైతులకు ఎంతో ఉపయోగకరం

## తెలంగాణ పశుసంవర్ధక శాఖ అదనపు సంచాలకులు డాక్టర్ బి. సుబ్బారాయుడు

**నారాయణపేట, మే 8 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న రైతు వారోత్సవాల్లో గురువారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని పశువైద్యశాల, జిల్లా పశు సంవర్ధక అధికారి కార్యాలయంలో సమగ్ర పశుసంవర్ధక సేవా శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ పశుసంవర్ధక శాఖ అదనపు సంచాలకులు డా. బి. సుబ్బారాయుడు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పశుసంపద సన్న,చిన్నకారు, నిరుపేద రైతులకు అదనపు ఆదాయ వనరుగా నిలుస్తుందని అన్నారు. పాడిపరిశ్రమ గ్రామీణ కుటుంబాలకు జీవనోపాధి కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. రైతులు దూడల సంరక్షణలో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించడంతో పాటు పశుగ్రాస పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. వేసవి కాలంలో పశువుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. జిల్లా పశువైద్యాధికారి డా. బి. ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అనేక మంది రైతులు గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని పాడిపశువుల పెంపకంపైనా రైతులు ఆసక్తి చూపాలని సూచించారు. పాడి రైతుల సౌకర్యార్థం జిల్లా కేంద్రంలో



పశువైద్య కరపత్రాలు విడుదల చేస్తున్న అధికారులు

పాల శీతలీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు మరియు పాడి రైతులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొండ శ్వేతాయాదవ్, వైస్ చైర్మన్ మంజుల, కౌన్సిలర్ కే.సత్యమ్మ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీసదాశివరెడ్డి, పశువైద్యాధికారులు డా. బి. వెంకటేశ్వర్లు, డా.అనిరుద్ ఆచార్య, డా. రాఘవేందర్ గౌడ్, డా.రోహిత్, డా. శ్రీనివాస్, పశువైద్య సిబ్బంది, గోపాలమిత్రులు, రైతులు పాల్గొన్నారు. కొస మెరుపు 2005,2007 కాలంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో సంయుక్త సంచాలకులుగా పనిచేసిన డాక్టర్ బి. సుబ్బారాయుడు, కుటుంబ పోషణ కోసం పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగించిన మహిళా పాడి రైతు కాకర్ల నారాయణమ్మ కృషిని గుర్తుచేశారు. అప్పట్లో ఆమెపై ప్రచురితమైన వార్త తనను ఎంతో ప్రభావితం చేసిందని పేర్కొంటూ, నారాయణమ్మను స్వయంగా కలిసి అభినందించారు.

## బస్సుల కొరతతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు

**- పెళ్లిళ్ల సీజన్‌తో రద్దీ పెరుగుదల - అదనపు బస్సులు నడపాలని ప్రజల డిమాండ్**

**ధన్వాడ, మే8 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో పెళ్లిళ్ల అధికంగా ఉండటంతో బస్సుల్లో ప్రయాణికుల రద్దీ గణనీయంగా పెరిగింది. మండల కేంద్రమైన ధన్వాడలో బస్సులు సరిపడా అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్సులు ఎక్కేందుకు జనాలు తోపులాటకు దిగిన దృశ్యాలు కనిపించాయి. ప్రత్యేకంగా ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ మరింత అధికమవుతోంది. ఈ పరిస్థితుల్లో మహిళలు, వృద్ధులు చిన్నపిల్లలు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తెలిపారు. ఇటువంటి రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు బస్సులు నడపాలని ప్రయాణికులు తెలంగాణ రవాణా సంస్థను గట్టిగా కోరుతున్నారు. అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఇబ్బందులు పడుతున్న మహిళా ప్రయాణీకులు

## రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలి

**లింగాల,మే 8,ప్రభాతవార్త:** విధిగా ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలను పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని ఎస్సై చంద్రకాంత్ సూచించారు. లింగాల పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటో, జీప్ డ్రైవర్లతో అవగాహనా కార్యక్రమాన్ని శుక్రవారం ఎస్ఐ ఎం. చంద్రకాంత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. అధిక ప్రయాణికులను ఎక్కించకూడదని, వేగ పరిమితిని పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలు నడపాలని తెలిపారు.అలాగే డ్రైవింగ్ లైసెన్స్,వాహన పత్రాలుతప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి డ్రైవర్ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్ఐచంద్రకాంత్ తెలిపారు.కార్యక్రమంలో పలువురుఆటో,జీప్‌డ్రైవర్లు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్సై చంద్రకాంత్

## తల సేమియాపై అవగాహన కార్యక్రమం

**రేవల్లి, మే 8 ప్రభాతవార్త:** రేవల్లి మండల కేంద్రంలో సామాజిక హెల్త్ సెంటర్లో అంతర్జాతీయ తల సేమియా దినోత్సవం సందర్భంగా రోగులకు తల సేమియా పై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. హాస్పిటల్ సిబ్బంది రాజేందర్ మాట్లాడుతూ కొందరు రోగుల్లో రక్తం అనేది డిసీజ్ వల్ల ఎక్కువ తక్కువ ఉంటుందని అట్లాంటి రోగులు ఉన్నట్లయితే దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టరును సంప్రదించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది ఏఎన్ఎం లక్ష్మి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైన విద్యార్థినులకు సన్మానం



స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైన విద్యార్థినులను సన్మానిస్తున్న దృశ్యం

**దామరగిద్ద, మే 8 ప్రభాతవార్త:** దామరగిద్ద మిల్కా సింగ్ స్పోర్ట్స్ అకాడమీ నుంచి స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైన విద్యార్థినులు హారిక, నిహారిక, కావేరిలకు శుక్రవారం దామర్‌గిద్ద అంబాభవాని ఆలయం సమీపంలో అకాడమీ ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దామరగిద్ద తండా సర్పంచ్ శరణ్ నాయక్, గోపాల్ రావు, కోచ్‌లు వెంకటప్ప, చంద్రశేఖర్, మహేష్, శ్రీకాంత్, నరేష్, సీనియర్ టీచర్ నాగేందర్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి రమణతో పాటు విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు విద్యార్థినులను అభినందించి శాలువాలతో సత్కరించారు.క్రీడల్లో మరిన్ని విజయాలు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.కార్యక్రమానికి హాజరైన అందరికీ మిల్కా సింగ్ స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకులు మహేష్ కృతజ్ఞతలు తెలిపారు.

### ఎమ్మెల్యే సహకారంతో దోండ్లపల్లిలో..

## నూతన గ్రామపంచాయతీ భవనానికి భూమి పూజ

◆ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు

**రాజాపూర్, మే 8 ప్రభాతవార్త:** రాజాపూర్ మండల పరిధిలోని దొండ్లపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం లేనందున గ్రామ సర్పంచ్, గ్రామస్తులు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి దృష్టికి తీసుకుపోయారు.దీంతో స్పందించిన ఎమ్మెల్యే గ్రామంలో 170 గజాల స్థలాన్ని కొనుగోలు చేసేందుకు రూ.10 లక్షలు సమకూర్చినట్లు గ్రామస్తులు తెలిపారు. నూతన గ్రామపంచాయతీ ఏర్పాటు కోసం కృషిచేసిన ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డికి గ్రామసర్పంచ్ పలువురు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దోండ్లపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ పండ్ల నర్సింలు, డిప్యూటీ సర్పంచి శివకుమార్ పంచాయతీ సెక్రెటరీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గిరిగౌడ్, వార్డ్ మెంబర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఘనంగా టికు నాయక్ జన్మదినోత్సవం

**రాజాపూర్, మే 8 ప్రభాతవార్త :** రాజాపూర్ మండలం నర్సింగ్ తాండ గ్రామపంచాయతీకి చెందిన భారత రాష్ట్ర సమితి నాయకులు అభిమన్యు రెడ్డి యువసేన సభ్యులు టీకు నాయక్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం భారత రాష్ట్ర సమితి జడ్చర్ల నియోజకవర్గం యువ నాయకులు చింోడు అభిమన్యు రెడ్డి కేకు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు భారత రాష్ట్ర సమితి నాయకులు, కార్యకర్తలు అభిమన్యు యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



టికు నాయక్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న అభిమన్యురెడ్డి

# రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

## పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది : కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**కల్వకుర్తి, మే 8 ప్రభాతవార్త:** రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు.కల్వకుర్తి పట్టణంలోని రైతువేధిక, వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు న్యాయం జరగాలనే, గిట్టుబాటు ధర, ఖచ్చితమైన తుకాలు, త్వరిత గతిన డబ్బులు చెల్లించేందుకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నారన్నారు. రైతలు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొని రావాలని,ఈ కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని,బయటి దళారులకు ధాన్యం ఇచ్చి మెసపొవద్దని



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కోరారు.కొనుగోలు కేంద్రం వద్ద రైతలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎమ్మెల్యే సదరు అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలాజీసింగ్, ఆనంద్ కుమార్, షానవాజ్ ఖాన్,యెన్నం భూపతిరెడ్డి, బచ్చు రామకృష్ణ, సంజీవ్‌కుమార్ యాదవ్, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## స్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి ఎస్‌డిఎఫ్ నిధులు మంజూరు

**కల్వకుర్తి, మే 8 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని రఘుపతి పేటరోడ్డులో గల స్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ కల్వకుర్తి పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు వాస శేఖర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి గతంలో విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం సందర్భంగా స్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి ఎస్‌డిఎఫ్ నిధుల నుంచి మంజూరైన రూ.5లక్షల ప్రొసీడింగ్ కాపీని ఆర్యవైశ్య మహాసభ సంఘం నాయకులకు అందించారు. స్మశాన వాటిక నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆర్యవైశ్య జిల్లా, పట్టణ నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ వావిళ్ళ సంజీవ్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా, పట్టణ నాయకులు బచ్చురామకృష్ణ, గందె రవి, గుబ్బకిషన్, పాపిశెట్టి ప్రసాద్, అప్పయిపల్లి శ్రీను, బొమ్మ ఆంజనేయులు, దాచేపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ విధానంలో చేపలు పెంచాలి

- **జిల్లా మత్స్యశాఖ సహాయ సంచాలకురాలు రాధా రోహిణి**
- **మత్స్యకార సంఘాల సభ్యులకు చేపల పెంపకంపై అవగాహన సదస్సు**

**మహబూబ్‌నగర్, మే 8, ప్రభాతవార్త:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో మత్స్యకార సహకార సంఘాల సభ్యులకు చెరువులలో కలుపు మొక్కల నివారణ, చేపలలో వ్యాధుల నిర్వహణ, చేపల ఉత్పత్తిని పెంచడంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ సహాయ సంచాలకురాలు రాధా రోహిణి మాట్లాడుతూ చెరువుల్లో కలుపు మొక్కలను తొలగించడం, పరిశుభ్రత పాటించడం, నీటి నాణ్యతను కాపాడడం ద్వారా చేపల ఉత్పత్తి పెరుగుతుందని తెలిపారు. అలాగే వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, చేపలలో వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే మత్స్య శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.మత్స్యశాఖ అధికారులు శాస్త్రీయ విధానాలతో చేపల పెంపకం, నాణ్యమైన చేప పిల్లల వినియోగం, మిశ్రమ చేపల పెంపకం, కేజ్ కల్చర్ విధానాలపై సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ పద్ధతుల



మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ద్వారా అధిక దిగుబడితో పాటు ఆదాయం పెంచుకోవచ్చని వివరించారు. సదస్సుకు వివిధ మండలాల మత్స్యకార సహకార సంఘాల సభ్యులు, రైతులు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మత్యకార పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జి జి. శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.వెంకటేష్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కె.వేణుగోపాల్, ఫిషరీస్ శాస్త్రవేత్తలు జి.గణేష్, శేఖర్, జి.గంగారాం, మత్స్యశాఖ క్షేత్రస్థాయి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పశువుల అక్రమ రవాణా నివారణకు పటిష్ట చర్యలు

◆ డీఎస్పీ నల్లపు లింగయ్య

**నారాయణపేట, మే 8 ప్రభాతవార్త :** రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో పశువుల అక్రమ రవాణా నివారణకు పోలీసులు పటిష్ఠ చర్యలు చేపట్టినట్లు డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. నారాయణపేట టౌన్ పోలీస్ స్టేషన్‌లో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్, గో రక్షకులు, బీజేవైఎం సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూఎక్కడైనా గోవుల అక్రమ రవాణా జరుగుతున్నట్లు అనుమానం వచ్చిన వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు.అయితే స్వయంగా వెళ్లి వాహనాలను అడ్డుకోవడం, గొడవలకు దిగడం వంటి చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. శాంతి భద్రతలకు భంగం కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన కోరారు.జిల్లాలో పశువుల అక్రమ రవాణాలను అరికట్టేందుకు 6 సరిహద్దు చెక్‌పోస్టులు,ఒక



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

అంతర్‌జిల్లా చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి నిరంతరం నిఘా నిర్వహిస్తున్నామని తెలిపారు.చట్టాన్ని ఎవరు చేతుల్లోకి తీసుకోరాదని, శాంతియుత సమాజనిర్మాణమే పోలీసుల ధ్యేయమని పేర్కొన్నారు.ఈ సమావేశంలో నారాయణపేట సీఐ శివశంకర్, టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ 2 గాయత్రి, విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, గోరక్షక కమిటీ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

# పశు సంపదను కాపాడుకోవాలి

◆ **మండల పశువైద్యాధికారిని డా. ప్రియాంక**

◆ **పాడి పరిశ్రమ మంచి లాభసాటి : మండల వ్యవసాయ అధికారి అనిల్**

**లింగాల,మే 8 ప్రభాతవార్త :** పశువులకు సోకుతున్న సీజనల్ వ్యాధులు నుంచి రైతులు పశువులను కాపాడుకుంటూ పశు సంరక్షణ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల పశు వైద్య అధికారిని డా.ప్రియాంక అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల పరిధిలోని మాదాపూర్ గ్రామంలో పశువులకు గర్భకోశ వ్యాధుల నివారణ శిబిరాన్ని, మేలు జాతి దూడల ప్రదర్శన శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి అనిల్ మాట్లాడుతూ పశువులు రైతులకు మంచి ఆదాయ వనరు కాబట్టి పశువులను పోషించుకున్నట్లయితే మంచి ఆదాయం లభిస్తుందన్నారు.ప్రతి రైతు కూడా విధిగా మేతలు సాగు చేసుకున్నట్లయితే పాడి పరిశ్రమ లాభసాటిగా ఉంటుందన్నారు.మండల పశువైద్యాధికారిని డా. ప్రియాంక మాట్లాడుతూ పశువులకు వచ్చే రోగాలు నివారణ చర్యల గురించి వివరించారు. పాడి గేదెలకు, పశువులకు, గొర్రెలకు, మేకలకు వచ్చే సీజనల్ వ్యాధులను అరికట్టేం దుకు రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం వేసవి కావడంతో పాడి ఆవులను నీడలో ఉండే విధండా చూసు కోవాలన్నారు. ఉదయం పశువులను తీసుకెళ్లి మధ్యాహ్నం వరకు



పశువైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్న వైద్యులు

నీడకు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పాడి రైతులు పశుగ్రాసాల పెంపకం, దూడల పెంపకంపై అవగా హన కలిగి ఉండాలని సూచించారు. పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స, కాల్షియం మినరల్ మిక్సచర్ మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఏఓ, ఉప సర్పంచ్, గోపాల మిత్ర సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## టీపీఎస్‌గా..తాండ్ర జిల్లా పరిషత్ పాఠశాల

**సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన కాయితీ ఆశాదీప్‌రెడ్డి**



**కల్వకుర్తి, మే 8 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ కార్యక్రమంలో భాగంగా స్థానిక కల్వకుర్తి మండలం తాండ్ర జిల్లా పరిషత్ పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తూ, తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా(టీపీఎస్)గా మార్చినందుకు రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు, తాండ్ర గ్రామ సర్పంచ్ కాయితి ఆశాదీప్ రెడ్డి గ్రామ ప్రజల తరుపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ప్రభుత్వానికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేట్ విద్య ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా, ఇంగ్లీష్ మీడియంలో, ఉచితంగా నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో, సమగ్ర విద్యావిధానం ప్రీప్రైమరీ (నర్సరీ) నుండి 12వ తరగతి వరకు విద్యను అందించేలా, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, రవాణా సౌకర్యాలను కల్పిస్తుండటంతో గ్రామీణ తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లోని పేద విద్యార్థులకు కూడా ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అందుబాటులోకి వస్తోందని, దీనివల్ల ప్రైవేట్ స్కూళ్లకు ఫీజులు కట్టే భారం తప్పుతుందని గ్రామ సర్పంచ్ కాయితి ఆశాదీప్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తాండ్ర జెడ్పీ స్కూల్‌ని తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీపీఎస్)గా మార్చడానికి సహకరించిన ప్రభుత్వ పెద్దలు రాజ్యసభ సభ్యులు వేంనరేందర్ రెడ్డికి, కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డికి,తెలంగాణ పంచాయతీ ట్రిబ్యునల్ చైర్మన్ సూదిని రాంరెడ్డి, సూదిని మనోహర్ రెడ్డి, కాయితి సాయిరెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కల్వకుర్తి ఎస్ఐగా కురుమూర్తి బాధ్యతలు



**కల్వకుర్తి, మే 8 ప్రభాతవార్త:** కల్వకుర్తి ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న మాధవరెడ్డి నారాయణపేట జిల్లా వీఆర్‌కు బదిలీ చేశారు. కల్వకుర్తి నూతన ఎస్ఐగా కురుమూర్తి బాధ్యతలు స్వీకరించారు. వెల్దండలో పనిచేసిన కురుమూర్తి కల్వకుర్తి ఎస్ఐగా బదిలీ అయ్యారు. వీరికి బదిలీ భాధ్యతలను గద్వాల జోగులాంబ ఐజి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారని కురుమూర్తి తెలిపారు. వెల్దండ మండలానికి నాగర్ కర్నూల్ జిల్లాలో వీఆర్‌లో విధులు నిర్వహిస్తున్న గంగిరెడ్డి యుగంధర్ రెడ్డిని నియమితులయ్యారు.

## పోషకాహారమే ఆరోగ్యానికి పునాది

**రాజాపూర్ సర్పంచ్ కావాలి రామకృష్ణ**



మాట్లాడుతున్న సర్పంచ్ కావలి రామకృష్ణ

**రాజాపూర్, మే 8 ప్రభాతవార్త:** ఆరోగ్యమే మహా భాగ్యమని, ఆరోగ్యానికి మించిన సంపద లేదని, పోషక ఆహారమే మన ఆరోగ్యానికి పునాది అని రాజాపూర్ గ్రామ సర్పంచ్, సర్పంచ్ ల సంఘం మండలఅధ్యక్షులు కావలి రామకృష్ణ అన్నారు. శుక్రవారం రాజాపూర్ పాత గ్రామపంచాయతీ కార్యాలయంలో కిశోర బాలికలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడారు. ప్రతిరోజు మనం తినే ఆహార పదార్థం మన ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుందని, పోషకాహారం తీసుకున్నప్పుడు ఆరోగ్య భాగ్యం కలుగుతుందన్నారు. మంచి ఆరోగ్యానికి పోషకాహారమే ఆధారంగా నిలుస్తుందని ఈ సందర్భంగా కిశోర బాలికలకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిని డా. సుస్మిత, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, ఆసుపత్రి సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## వైభవోపేతంగా వీర నాగమ్మ పండుగ

(మొదటి పేజీ తరువాయి)

కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గ్రామ దేవతల పండుగ లు కేవలం పూజలకే పరిమితం కాకుండా, ప్రజలందరినీ ఏకం చేసి ఐక్యత ను, సోదరభావాన్ని పెంపొందిస్తాయని వారు కొనియాడారు. ప్రజలంతాసుఖ సంతోషాలతో ఉండాలని, పాడిపంటలతో గ్రామం సుభిక్షంగా వర్ధిల్లాలని తాము అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉదయం వేళల్లోనే ఉపాధి హామీ పనులు చేపట్టాలి

**వెల్దండ, మే 8 ప్రభాతవార్త:** వేసవికాలం దృష్ట్యా ఉపాధి హామీ పనులు ఉదయం 6:30లకు పనులు చేపట్టాలని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో చిన్నారెడ్డి చెరువులో పుడికతీత పనులను గ్రామ సర్పంచ్ కేశమల్ల అనుష కృష్ణతో కలిసి ఎంపీడీఓ పరిశీలించారు. కూలీలు కొలతల ప్రకారం పని చేస్తే రోజువారి కూలి 350 రూపాయలు వస్తుందని, అలాగే పని ప్రదేశంలో కూలీలు సేదతీరేందుకు నీడ కొరకు టెంట్లు ఏర్పాటు చేయాలని, త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందు బాటులో ఉంచాలన్నారు. కూలీల హాజర్, మాస్టర్ జాబు కార్డుల ను ఎంపీడీఓ పరిశీలించారు. అనంతరం నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మణ్, ఏపీఓ ఈశ్వర్, పంచాయతీ కార్యదర్శి అలివేలు, ఫీల్డ్ అసిస్టెంట్ మేట్స్ తదితరులు ఉన్నారు.



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణయ్య

## డీజీపీని కలిసిన హెచ్‌సిఏ సెక్రటరీ మన్నే జీవన్ రెడ్డి




డీజీపీ సివి ఆనంద్‌ను కలిసి బొకే అందజేస్తున్న మన్నే జీవన్‌రెడ్డి

**మహబూబ్‌నగర్, మే8, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర డిజిపిగా బాధ్యతలు స్వీకరించిన సివి ఆనంద్‌ను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) సెక్రటరీ, టిటిడి బోర్డు మాజీ సభ్యుడు మన్నె జీవన్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల నూతనంగా నియమితులైన డిజిపిని గురువారం ఆయన చాంబర్‌లో కలిసి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## ఎస్ఐ కురుమూర్తి బదిలీ

**వెల్దండ, మే 8 ప్రభాతవార్త:** వెల్దండ ఎస్ఐగా కురుమూర్తి 2024 సంవత్సరం జూలై నెలలో బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి ప్రజలతో సౌమ్యంగా ఉంటూ శాంతి భద్రతలు పర్యవేక్షిస్తూ మంచి పేరు తెచ్చుకున్నారు. ఇక్కడి నుండి కల్వకుర్తి ఎస్ఐగా కురుమూర్తి బదిలీ కాగా ఆయన స్థానంలో నాగర్‌కర్నూల్ వీర్‌లో ఉన్న యుగంధర్‌రెడ్డి బదిలీపై వెల్దండ ఎస్ఐగా రానున్నారు.

## నియోజకవర్గంలో 95 శాతం ఇందిరమ్మ ఇండ్లు పూర్తి

**- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



ఇందిరమ్మ గృహన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**కల్వకుర్తి, మే 8 ప్రభాతవార్త:** ఇందిరమ్మ రాజ్యాంలో పేదల సొంతింటి కళలు సాకరమవుతున్నాయని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో 95 శాతం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, త్వరలోనే 100 శాతం పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామన్నారు. శుక్రవారం పట్టణంలోని ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాల కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన ఇందిరమ్మ గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం నికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, అందులో 95శాతం పూర్తి చేశారన్నారు. గత ప్రభుత్వం మాటలతో కాలక్షేపం చేసేవారని, ఇప్పటి కాంగ్రెస్ పార్టీ పేదలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. ప్రతి గ్రామాల్లో రోజు ఎదో ఒక చోట ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు జరుగుతున్నాయని, లబ్ధిదారులు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీ సింగ్, ఆనంద్ కుమార్, షానవాజ్ ఖాన్, యెన్నం భూపతిరెడ్డి, బచ్చు రామకృష్ణ, సంజీవ్‌కుమార్‌యాదవ్, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## కొల్లాపూర్‌లో విద్యావార్షికోత్సవాలు

- విద్యార్థి మేధస్సును వెలికి తీయడానికే వేసవి శిబిరాలు
- ఎంఇఓ పి.ఇమాన్యుయేలు



**కొల్లాపూర్, మే8, ప్రభాతవార్త :** కొల్లాపూర్ మండల కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం 99 రోజుల యాక్షన్ ప్లాన్లో భాగంగా విద్యా వారోత్సవాలు పిఎంశ్రీ స్కూల్ అయిన జెడ్పిహెచ్‌ఎస్ ( జిఎం) పాఠశాలలో వేసవి సెలవులు కేవలం ఆటలకే పరిమితం చేయకుండా, విద్యార్థుల్లో సృజనాత్మకంగా వెలుగు తీసేందుకు విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన పిఎంశ్రీ , కెజిబివి పాఠశాలలో ప్రత్యేక వేసవి శిబిరాలు నిర్వహించనున్నది. ఈ వేసవి శిబిరాలు ఈ నెల మే 11 నుంచి మే 25 వరకు 15 రోజులపాటు కొనసాగనున్నాయి. విద్యార్థులకు ఆసక్తికరమైన అంశాలలో శిక్షణ ఇవ్వనున్నారు. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంచేలా ప్రణాళికలు రూపొందించారు. చిత్రలేఖనము, నృత్యము, సంగీతము, హస్తకళల వంటి అంశాలుశారీరక ద్రఢత్వం కోసము యోగ, మెడిటేషన్, చెస్, క్యారమ్స్ , డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్, తయారీ సహా వివిధ కలలో శిక్షణ ఇస్తారు. చందమామ కథలు చదివించడంరాయించడం వంటివి, సామాజిక అంశాలపై డిబేట్ సైన్స్ ప్రయోగాలు కంప్యూటర్ శిక్షణ ఇచ్చే కార్యక్రమాలు చేపట్టనున్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి ఈ శిబిరంలో పీఎం శ్రీ పాఠశాలవిద్యార్థులతో పాటు ఇతర పాఠశాల విద్యార్థులు కూడా పాల్గొనవచ్చు. ఈ మండలంలోని తల్లిదండ్రులు మీ పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మీ సమీప కేంద్రాల్లో చేర్పించండి. విద్యా వారోత్సవం ఈనెల మే 11 నుండి మే 17 వరకు కార్యక్రమాలు కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలంలోని ప్రతి పాఠశాల ఉపాధ్యాయుడు కార్యక్రమంలో మీ పాఠశాలలో పాల్గొనాలి. మే11వ తేదీన మౌలిక సదుపాయాలు , పిఎంశ్రీ, కెజిబివిలలో వేసవి శిబిరాలు ప్రారంభం. 12వ తేదీన ఎస్ఎస్ విద్యార్థులకు ( సప్లమెంటరీ పరీక్షల కొరకు) రెమిడీయల్ క్లాస్ ( ప్రత్యేక శిక్షణ ) శిబిరాలు. 13వ తేదీన ప్రజాప్రతినిధులతో విద్యాభివృద్ధిపై వర్క్ షాప్ 14వ. తేదీన జయశంకర్ బడిబాట, పీటీమ్ కార్యక్రమాలు. 15వ తేదీన లైబ్రరీ పుస్తక ప్రదర్శనలు. 16వ తేదీన కళా విభాగం ఆర్ట్స్, క్రాఫ్ట్స్ కల్చరల్ డే. 17వ తేదీన విద్యా విజయోత్సవం పదోవ, ఇంటర్, స్పోర్ట్స్ టాపర్లకు సన్మానాలు ఆయా పాఠశాలల స్థాయిని బట్టి నిర్వహించుకోవాలని కోరారు.

## రైతులు సబ్సిడీలను సద్వినియోగం చేసుకోండి

**రాజాపూర్ గ్రామ సర్పంచ్ కావలి రామకృష్ణ**

**రాజాపూర్, మే 8 ప్రభాతవార్త :** రాజాపూర్ మండల రైతులు పశుసంవర్ధక శాఖ అందజేసే ఉచిత గర్భధారణ రోగ నిరోధక టీకాలను, ఉచిత నట్టల నివారణ మందులను, పలు రకాల సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాజాపూర్ గ్రామ సర్పంచ్, సర్పంచ్ ల సంఘం మండల అధ్యక్షులు కావలి రామకృష్ణ అన్నారు. శుక్రవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాజాపూర్ రైతు వేదిక వద్ద నిర్వహించిన రైతువారం కార్యక్రమంలో ఆయనపాల్గొని మాట్లాడారు. అనంతరం పలువురు రైతులకు పశువులకు సంబంధించిన పలు రకాల మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు పశువుల మందులు అందజేస్తున్న సర్పంచ్ రామకృష్ణ

# ముదిరాజ్ సమస్యలను పరిష్కరించాలి

**బీసీ ఏ కేటగిరిలోకి మార్చండి**
**మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో సీఎం రేవంత్ రెడ్డికి, డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ విజ్ఞప్తి**



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి, డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 8, ప్రభాతవార్త :** రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ తో కలిసి శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ముదిరాజ్ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంపై విజ్ఞప్తి చేశారు. బీసీడీ కేటగిరిలో సీరియల్ నంబర్ 19లో ఉన్న ముదిరాజ్లను బీసీఏ కేటగిరిలోకి మార్చాలని కోరారు. దీంతో ముదిరాజ్ యువతకు విద్య, ఉద్యోగాలు, సంక్షేమ పథకాల్లో మరిన్ని అవకాశాలు లభిస్తాయని, సామాజిక న్యాయం మరింత బలపడుతుందని సీఎం దృష్టికి తీసుకొచ్చారు. సీఎంసానుకూలంగా స్పందించి ప్రధాన కార్యదర్శి శేషాద్రిని ఈ అంశాన్ని సమగ్రంగా పరిశీలించి ఎలాంటి న్యాయపరమైన లేదా పరిపాలనా ఇబ్బందులు లేకుండా సమస్యను ఎలా పరిష్కరించవచ్చో అధ్యయనం చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. అదే విధంగా బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి కొండా సురేఖ, మంత్రి శ్రీహరిలను బీసీకమిషన్‌తో చర్చించి సమస్య పరిష్కారానికి సంబంధించి సమగ్ర నివేదిక సిద్ధంచేయాలని సూచించినట్లు తెలిపారు. ఇదే అంశంపై రాజకీయ పార్టీలతో చర్చించాలని, ముఖ్యంగా కాసాని జ్ఞానేశ్వర్, ఈటెల రాజేందర్, బండప్రకాశ్‌తో సంప్రదింపులు జరిపి వీలైనంత త్వరగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఎం సూచించినట్లు తెలిపారు. ఈ ప్రతినిధి బృందంలో హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిత్, టీపీసీసీ కార్యదర్శి వెంకటేశ్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

# జనగణన ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలి

◆ వీసీలో రాష్ట్ర జనగణన అధికారి భారతి హోలికేరి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా అధికారులు




**వనపర్తి, మే8, ప్రభాతవార్త:** సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను వేగవంతం చేసి అత్యధిక శాతం ప్రజలు, ప్రభుత్వ సిబ్బంది అందులో పాల్గొని తమ వివరాలను నమోదు చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర జన గణన అధికారి భారతి హోలికేరి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జన గణన ప్రక్రియపై కలెక్టర్లకు ఆమె పలు కీలక సూచనలు చేశారు. జనగణన ప్రక్రియలో పాల్గొనబోయే సిబ్బందికి అందరికి శిక్షణ పూర్తి చేసి, అటెండెన్స్ వివరాలను అప్డేట్ చేయాలని సూచించారు. ఈ సమావేశానికి వనపర్తి జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో పాటుగా అదనపుకలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్ హాజరయ్యారు. విసి అనంతరం కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులతో మాట్లాడుతూ జనగణన ప్రక్రియలో పాల్గొనబోయే సిబ్బందికి శిక్షణ పూర్తి చేసి అటెండెన్స్ అప్డేట్ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా, సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను వేగవంతం చేసి అత్యధిక శాతం ప్రజలు, ప్రభుత్వ సిబ్బంది అందులో పాల్గొని తమ వివరాలను నమోదు చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సిబ్బంది ప్రతి ఒక్కరు తప్పనిసరిగా సెల్ఫ్ ఎన్యూమరేషన్ లో పాల్గొని వివరాలు నమోదు చేయాలని ఆ దిశగా సంబంధిత జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం రెండు రోజులే గడువు ఉన్న నేపథ్యంలో వీలైనంత ఎక్కువమంది ఇందులో పాల్గొనేలా చూడాలన్నారు. సమావేశంలో సిపిఓ హరికృష్ణ, జెడ్పి సీఈవో యాదయ్య, డిఎల్పిఓ రఘునాథ్, డిప్యూటీ సీఈఓ రామమహేశ్వర్, మత్స్యశాఖ అధికారి లక్ష్మప్ప, డివైస్ ఓ సుధీర్‌రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జడ్చర్లకు ఆధ్యాత్మిక శోభా

■ నేడు 28 అడుగుల ఏకశిలా హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం



నేడు జడ్చర్లలో ప్రతిష్టించనున్న 28 అడుగుల ఏకశిలా హనుమాన్ విగ్రహం

**జడ్చర్ల, మే8 ప్రభాతవార్త :** జడ్చర్ల పట్టణానికి మరింత ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనున్నది. పట్టణ సమీపంలోని పివిఆర్ ఎస్టేట్‌లో శనివారం జరగనున్న ఏకశిలా హనుమంతుడి ప్రాణప్రతిష్ఠతో పర్యాటక పటంలోకి మరో కొత్త ఆధ్యాత్మిక కేంద్రం చేరబోతోంది. పెద్దగుట్టపై శ్రీ రంగ నాయక స్వామి, పట్టణ నడిబొడ్డున వెంకటేశ్వర స్వామి, శ్రీ రమా సహిత సత్య నారాయణస్వామి, అయ్యప్పస్వామి దేవాలయాలు, సమీప గంగాపూర్‌లో శ్రీశ్రీశ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం, మలయాళ స్వామి ఆశ్రమం, కుర్వగడ్డ పల్లి వద్ద పర్వవేదీశ్వర స్వామి, గొల్లపల్లి వద్ద లలితాంబికా దేవి, బండమీదిపల్లి దగ్గర పంచలింగాల ఆలయాలతో ధార్మిక కేంద్రంగా పేరొందిన ఈ ప్రాంతానికి తలమానికంగా ఇప్పుడు 28 అడుగుల ఏకశిలా హనుమాన్ విగ్రహం నిలువబోతోంది. శ్రీశ్రీశ్రీ ఆంజనేయ స్వామి ఏకశిలా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం నుంచి వైభవంగా జరుగుతున్నాయి. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి వారి దివ్య మంగళ శాసనాలతో జరుగుతున్న ఈ ఉత్సవాల్లో శనివారం ఉదయం 9 గంటల 45 నిమిషాలకు శ్రీశ్రీశ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి వారి కరకమలములచే యంత్ర స్థాపన, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, నేత్ర ఉన్మీలనం, ప్రథమ దర్శనం జరగనుంది. ఈ ప్రాంతంలోనే అత్యంత భారీ 28అడుగుల ఏకశిలా హనుమాన్ విగ్రహ ఆవిష్కరణతో జడ్చర్ల ఆధ్యాత్మిక, ధార్మిక కేంద్రంగానే కాక ప్రముఖ పర్యాటక క్షేత్రంగానూ విరాజిల్లనున్నది. విగ్రహ ప్రతిష్ఠాపకులైన ప్రముఖ హృద్రోగ నిపుణులు డా.పెరుమాళ్ళ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ "రంగనాయకుడు, వేంకటేశుడు, అయ్యప్ప, సత్యనారాయణ స్వామి, పంచలింగాలు, చెన్నకేశవుడు, పర్వవేదీశ్వరుడు, లలితాంబిక వంటి దేవతామూర్తులు కొలువైన ఈ పుణ్యభూమిలో హనుమంతుని ఏకశిలా విగ్రహాన్ని నెలకొల్పడం తమ అదృష్టమని, ఈ ప్రాంతంలో ఆధ్యాత్మికతను పెంపొందిం చడంతోపాటు జడ్చర్లను దక్షిణ భారతదేశంలోనే ప్రముఖ పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఈ 28 అడుగుల విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టామని అన్నారు.

# సారాపై ఉన్నసోయి.. రైతులపై లేదా ?

- రెండు రోజుల్లో ధాన్యం కొనుగోలు చేయకుంటే కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఉద్యమిస్తాం
- బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కళ్యాణ్ నాయక్, రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బిజెపి నాయకులు

**జడ్చర్ల, మే 8, ప్రభాతవార్త :** జడ్చర్ల ఎమ్మెల్యే కు ఇప్పపువ్వు సారా మీద ఉన్న సోయి నియోజకవర్గ రైతుల ధాన్యం కొనుగోలు పై లేదని, 20 రోజుల పైగా మక్కలను మార్కెట్ యార్డ్‌లో పోసుకొని రైతులు ఇబ్బందులు పడుతుంటే చోద్యం చూస్తున్నారా అంటూ బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కళ్యాణ్ నాయక్, రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి విమర్శించారు. 20 రోజుల నుండి మార్కెట్ యార్డ్ మొక్కజొన్న ధాన్యంతో పడిగా పులు కాస్తున్న వారిని పలకరించే దిక్కు లేకుండా పోయిందని స్థానిక ఎమ్మెల్యే అనవసరమైన విషయాల్లో జోక్యం చేసుకోవడం కాదు ముందు రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసి మార్కెట్ యార్డులో ఉన్న రైతుల సమస్యలను పరిష్కరించే వాటిపై దృష్టిసారించాలని సూచించారు. శుక్రవారం జడ్చర్ల వ్యవసాయ పత్తి మార్కెట్లో మొక్క జొన్న కేంద్రాలను పరిశీలించారు. రైతులను అడిగి వారి సమస్యలను తెలుసుకున్నారు. రైతులు చెమటోడ్చి పండించిన మక్కలను ప్రభుత్వం ఇంతవరకు కొనుగోలు చేయడం లేదు. పది రోజుల నుండి మార్కెట్లో రైతులు పడుతున్న ఇబ్బందులను చూసి అధికారులను నిలదీశారు. ప్రభుత్వం వెంటనే మక్కలను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిచో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అమర్నాథ్‌గౌడ్, రాష్ట్ర కిసాన్ మోర్చా నాయకులు ఎంబి బాలకృష్ణ, కౌన్సిల్ మెంబర్ ముచ్చర్ల కృష్ణయ్య, జిల్లా అధికార ప్రతినిధి బాలవర్ధన్ గౌడ్, జిల్లానాయకులు శ్రీనివాస్ రెడ్డి, సామల నర్సింహులు, నడిమింటి శ్రీనివాసులు, కిసాన్ మోర్చా నాయకులు బుక్క నవీన్, మురళీకృష్ణ, బాలనగర్, మిడ్జిల్ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్, నరేష్ నాయక్, పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకట్, వెంకట్ భైరవ్, జగదీష్, గణేష్ గుండప్ప, శివ శంకర్ రెడ్డి, మల్లేష్, అంజలి పాల్గొన్నారు.

# రైతులు పంటల మార్పిడి పద్ధతులను అనుసరించాలి




రైతు వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు,శాస్త్రవేత్తలు

**గోపాల్ పేట, మే8 ప్రభాతవార్త:** ప్రొ॥ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమాన్ని వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం గోపాల్‌పేట గ్రామంలోని రైతు వేదిక లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చాకలపల్లి గ్రామ సర్పంచ్ శేషిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అగ్రోనామీ విభాగానికి చెందిన శాస్త్రవేత్త డా. ఎన్.నవత రైతులకు పలు ముఖ్యమైన సూచనలు చేశారు. తక్కువ యూరియా వాడటం ద్వారా సాగు ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. అధిక మోతాదులో యూరియా వినియోగించడం వల్ల నేల సారం తగ్గిపోవడంతో పాటు పంటల నాణ్యత కూడా దెబ్బతింటుందని వివరించారు. నేల పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించడం ఉత్తమమని సూచించారు. అవసరానికి మించి రసాయన ఎరువులు, పురుగు మందులను వినియోగించడం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా రైతులకు అదనపు ఆర్థిక భారం పడుతుందని తెలిపారు. వరి తర్వాత పప్పుధాన్యాలు లేదా నూనెగింజల పంటలు సాగు చేయడం వల్ల నేల సారం పెరుగుతుందని తెలిపారు. రైతులు ఒకే పంటను నిరంతరం సాగు చేయకుండా పంటల మార్పిడి పద్ధతులను అనుసరించాలని సూచించారు. సాయిల్ సైన్స్ విభాగానికి చెందిన పరమేష్ మాట్లాడుతూ నేల పరీక్షలు నిర్వహించి వాటి ఆధారంగా ఎరువుల వినియోగం చేపడితే దిగుబడులు పెరగడంతో పాటు నేల సారం కూడా కాపాడవచ్చని తెలిపారు. రైతులు సేంద్రియ పదార్థాలను అధికంగా వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కరుణశ్రీ, వ్యవసాయ విస్తరణ అధికారి నాగరాజు రైతులు పాల్గొన్నారు. రైతులు అడిగిన పలు సందేహాలకు శాస్త్రవేత్తలు సమగ్రంగా సమాధానాలు ఇచ్చారు.

## విద్యార్థులే అతిథులుగా..

### ధన్వాడ డిగ్రీ కళాశాల ప్రారంభోత్సవం

◆ ప్రేక్షకులుగా నిలిచిన నాయకులు..
◆ విద్యార్థులే ముందుండి నిర్వహించిన అరుదైన ఘటన





భూమిపూజ చేస్తున్న విద్యార్థులు

**ధన్వాడ, మే 8 ప్రభాతవార్త :** ధన్వాడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన డిగ్రీ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమం ప్రత్యేకంగా నిలిచింది. సాధారణంగా రాజకీయ నాయకులు నిర్వహించే భూమి పూజ కార్యక్ర మాన్ని ఈసారి విద్యార్థులే స్వయంగా చేపట్టడం విశేషంగా మారింది. కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు గుణపం, పారపట్టి, టెంకాయ కొట్టి సంప్రదాయ పద్ధతిలో భూమి పూజను ప్రారంభించారు. ఈ అరు దైన దృశ్యం అక్కడికి వచ్చిన ప్రజలను ఆకట్టుకుంది. కార్యక్రమానికి హాజరైన ప్రముఖ రాజకీయ నాయకులు ఈ సందర్భంగా ప్రేక్షకులుగా నిలిచి, విద్యార్థుల ఉత్సాహాన్ని అభినందించారు. అధికార పార్టీకి చెందిన నాయకులు కళాశాలఅభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల చేతుల మీదుగా ప్రారంభమైన ఈ కార్యక్రమం ధన్వాడలో విద్యాభివృద్ధికి శుభారంభంగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.

## స్వీయ గణనను సద్వినియోగం చేసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీ వరకు స్వీయ నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. జనగణనకు సంబంధించిన సమాచారాన్ని కేవలం 15 నిమిషాల్లో పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. వివరాలు నమోదు చేసిన అనంతరం ప్రత్యేకమైన సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐడి జారీ అవుతుందని చెప్పారు. ప్రభుత్వం నియమించిన ఫీల్డ్ ఎన్యూమరేటర్లు మే 11 నుంచి జూన్ 9వరకు ఇంటింటికి వచ్చి ధృవీకరణ చేపడతారని, ఆ సమయంలో ప్రజలు తమ నంబర్‌ను తెలియజేయాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా ముందుగానే వివరాలు నమోదు చేసుకుంటే ధృవీకరణ సమయంలో ఇంట్లో భౌతికంగా ఉండాల్సిన అవసరం ఉండదని, ఎన్యూమరేటర్లు ఆధారంగా వివరాలను పరిశీలించి ధృవీకరిస్తారని కలెక్టర్ తెలిపారు. ఉద్యోగరీత్యా ఇతరప్రాంతాల్లో ఉండేవారు, విద్యార్థులు, వలస కార్మికులు, ప్రయాణాల్లో ఉన్నవారికి ఈ విధానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. స్వీయ గణనలో ఖచ్చితమైన చిరునామా, సరైనవివరాలు నమోదు చేయాలని, వాటి ఆధారంగానే ఎన్యూమరేటర్లనునియమించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి పౌరుడి వివరాలు జనగణనలో నమోదుకావడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ డిజిటల్ విధానాన్ని ప్రవేశపెట్టిందని చెప్పారు. ప్రజల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని భరోసా కల్పించిన కలెక్టర్ సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు, సమగ్ర అభివృద్ధికి జనగణన ఎంతో కీలకమని పేర్కొన్నారు. జిల్లాలో ఈ ప్రక్రియ విజయవంతం కావడానికి ప్రజలు సహకరించాలని కోరారు.

## ఎట్టకేలకు వృద్ధుల నిరీక్షణకు తెర..

(మొదటి పేజీ తరువాయి)

ముందుకు తీసుకువచ్చింది. ఏప్రిల్ 29న పెన్షన్ పర్సన్", మే 1న పెన్షన్ ఆలస్యంపై ధన్వాడలో మళ్లీ రాస్తారోకో", మే 6న పింఛన్ నిరీక్షణ" అనే శీర్షికలతో ప్రచురించిన వార్తలు ప్రజల్లోనే కాక అధికారుల్లో కూడా చైతన్యం తీసుకువచ్చాయి. పింఛన్ల డబ్బుల కోసం ముప్పుతిప్పలు..ఎండల్లో ముసలోళ్ల నిరీక్షణ..అధికారుల పెన్షన్ పరేషాన్" అనే కథనం పరిస్థితిని స్పష్టంగా ప్రతిబింబించింది. ఈ కథనాల ప్రభావంతో చివరకు అధికారులు స్పందించి శుక్రవారం నుంచి పింఛన్ డబ్బుల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఉదయం నుంచే లబ్ధిదారులకు నగదు పంపిణీ ప్రారంభమై సమస్యకు ముగింపు పలికింది. వార్తాపత్రిక ప్రచురణల ద్వారానే తమ సమస్య పరిష్కారమైందని పలువురు వృద్ధులు, వికలాంగులు అభినందనలు తెలిపారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి అధికారులను కదిలించే శక్తి వార్తా మాధ్యమాలకు ఉందని ఈ ఘటన మరోసారి రుజువు చేసింది.



తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

## క్రషర్‌లో భారీ పేలుళ్లు.. ఇళ్లకు పగుళ్లు

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పడి ప్రజలకు శ్వాస సంబంధిత వ్యాధులు వస్తున్నాయని తెలిపారు. రాత్రి వేళల్లో జరిగే భారీ బ్లాస్టింగ్‌లతో చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ ఘటనపై శనివారం బాలానగర్ సర్పంచ్ గుమ్మల్ల వెంకటేశ్వర్, టి.పిసిసి సమన్వయకర్త దత్తాత్రేయ, వార్డు సభ్యులు తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. బ్లాస్టింగ్ శబ్దాలతో మండల కేంద్రంలోని ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని, అనుమతులు లేకుండా బ్లాస్టింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు.

## తరుగు పేరిట రైతుల నిలువు దోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేస్తున్నార రైస్ మిల్లులో యజమానులు ఇస్తాను సారంగా ప్రతి బస్తాకు నాలుగు కిలోల మేరా తరుకు తీయిస్తే ప్రతి క్వింటాలకు 10 కిలోల చొప్పున ధాన్యాన్ని తాము కోల్పోవాల్సి వస్తుందని ఆరుగాలం కష్టపడి పండించిన రైతులకు ప్రభుత్వం ఇచ్చే కానుక ఇదేనా అంటూ శుక్రవారం రోజు ఆయా గ్రామాలకు చెందిన పలువు రైతులు ప్రభాత వార్తతో వాపోయారు. ఇదిలా ఉండగా ఆత్మకూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యాలయానికి 40 వేల గన్ని బ్యాగులు అవసరమవుతాయని ఉన్నతాధికారులకు నివేదికలు పంపించగా కేవలం 5000 బ్యాగులు మాత్రమే తమకు ఇప్పటివరకు అందాయని త్వరలోనే గన్ని బ్యాగులు తెప్పించి రైతులకు సరఫరా చేస్తామని ఆత్మకూర్ పిఎసిఎస్ సీఈఓ నరేష్ ప్రభాతవార్తకు తెలిపారు.

**సీఈఓ నరేష్ వివరణ :** ఆత్మకూర్ పట్టణంలోని రైస్ మిల్లులో యజమానులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల దగ్గర విక్రయిస్తున్న రైతుల నుండి క్వింటాలకు 10 కిలోల మేర తరుగు తీస్తున్న విషయాన్ని ఆత్మకూర్ పిఎస్ఈఎస్ సీఈఓ నరేష్ను ప్రభాతవార్త వివరణ కోరగా ప్రభుత్వం నుండి తరుగు తీయాలని ఎలాంటి ఆదేశాలు లేవని రైస్ మిల్లులో యజమానులు మాత్రం తరుగు తీస్తున్నట్లుగా తమ దృష్టికి రాలేదని రైతులు ఈ విషయాన్ని తమ దృష్టికి తెస్తే ఉన్నతాధికారులకు నివేదించడమే కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందని ఆయన వివరించారు.